ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
3
సోమవారం 17 జూన్ 2024

## గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోండి

బషీరాబాద్, జూన్ 16: గృహజ్యోతి పథకం కింద జీరో బిల్ రాని అర్హులెవరైనా ఉంటే ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీవీ కరుణఅజయ్‌ప్రసాద్ తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో ఆర్జీ పెట్టుకున్న వారు జీరో బిల్లు వర్తించకుంటే అప్పట్లో దరఖాస్తు రశీదుతో పాటు ఆధార్, రేషన్‌కార్డులు, కరెంట్ బిల్లుల జిరాక్స్ ప్రతులతో సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

# ఈద్గాల ముస్తాబు

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నేడు బక్రీద్


చెనెగేష్‌పూర్ రోడ్డులోని ఈద్గా

తాండూరు/కొడంగల్/పరిగి, జూన్ 16: జూన్ 16: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను సోమవారం జరుపుకునేందుకు మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో ముస్లింలు ఏర్పాట్లు చేశారు. వికారాబాద్ జిల్లాలోనే అత్యధికంగా ముస్లింలు ఉన్న తాండూరు పట్టణంలో పెద్ద ఎత్తున బక్రీద్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.చెనెగేష్‌పూర్ రోడ్డు మార్గంలోని ఈద్గా, హైదరాబాద్‌రోడ్డు మార్గంలోని ఖాంజాపూర్ గేట్ వద్దనున్న ఈద్గాలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. ఈద్గా కమిటీ అధ్యక్షులు యూసుఫ్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ప్రార్థనలు చేయనున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో టెంట్లు, తాగునీటి సౌకర్యం, స్వాగత తోరణాలను ప్రతి యేడాది మాదిరిగానే ఈ యేడాది ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 10వేలకు పైగా ముస్లింలు ప్రార్థనలు చేయనున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి మైనారిటీ నాయకులతో కలిసి కొడంగల్‌లో ఈద్గాను పరిశీలించారు. ఈద్గా పరిసరాల్లో మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. కులకచర్ల, ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల, పుట్టపహడ్, చౌడాపూర్ గ్రామాల్లోని ఈద్గాలను ప్రత్యేక ప్రార్థనల ఏర్పాట్లు చేశారు. పరిగి మునిసిపల్ పరిధిలోని అనంతరెడ్డినగర్, సుల్తాన్ నగర్‌లలోని ఈద్గాల వద్ద మునిసినల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, సిబ్బంది వినోద్, జగర్ తదితరులు ఈద్గాల వద్ద శుభ్రం చేయించారు.


పరిగిలోని ఈద్గా వద్ద ఏర్పాట్లు చేస్తున్న మునిసిపల్ అధికారులు

## మోదీ వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

» ఏఐటీయూసీ ద్వితీయ మహాసభలో నేతలు

తాండూరు, జూన్ 16: మోదీ ఆధ్వర్యంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అవలంబిస్తోన్న కార్మికుల వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా పోరాడుతామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ అన్నారు. తాండూరు పట్టణం గగరాణిఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏఐటీయూసీ వికారాబాద్ జిల్లా ద్వితీయ మహాసభల్లో ఆయన మాట్లాడారు. దేశంలో 44 చట్టాలను ఏఐటీయూసీ సాధించిందని గుర్తు చేశారు. సంఘం నాయకులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. దేశ వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై 24 జాతీయ సమ్మెలు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో ఏఐటీయూసీని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ మహాసభల్లో ఐదు కీలక అంశాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయలక్ష్మీ పండిత్, బాల శంకర్, భూపలి, పి.నర్సింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రయ్య, కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.




కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్‌పై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన పనులను కొనసాగించేందుకు పాలనపై దృష్టి సారించిన సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొడంగల్-నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగు నీరు, తాగునీటి అవసరాల కోసం అమలు చేయనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో వేగం పెంచాలని నిర్ణయించారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో భూ సేకరణ సమస్యలు తలెత్తకుండా ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు రూ.4.350 కోట్ల ఖర్చుతో రెండు దశల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ తక్కువ ఖర్చుతో పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం**

» రూ.4,350 కోట్ల అంచనాతో రెండు దశల్లో పథకం పూర్తికి కసరత్తు
» 2.1 టీఎంసీల నుంచి 4.02 టీఎంసీల నిల్వకు వీలుగా చెరువుల అభివృద్ధి
» రూ.2,945.50 కోట్ల నుంచి రూ.4.350 కోట్లకు పెరిగిన నిధుల అంచనా
» సంగం బండకు బదులు బీమా, భూత్పూర్ జలాశయాల నుంచి పథకానికి రూపకల్పన
» ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


సంగం బండ ప్రాజెక్టు

# కొడంగల్ లిఫ్ట్‌పై ఫోకస్!



లక్ష ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా పనులు

### ప్రాజెక్టు పూర్తితో సస్యశ్యామలం



కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం పూర్తితో కొడంగల్ ప్రాంతం సస్యశ్యామలం కానుంది. లక్ష ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పథకంలో మార్పులు చేపట్టి పనుల వేగవంతానికి ఆదేశించారు. రెండు దశల్లో పనులు పూర్తి కావడంతో సాగునీరందుతుంది. బీడుగా మారిన పొలాలన్నీ సస్యశ్యామలం కానున్నాయి.

- తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

### చెరువుల పునరుద్ధరణతో నీటి నిల్వకు అవకాశం



కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంతో చెరువుల పునరుద్ధరణ జరగడం సంతోషదాయకం. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవడం శుభపరిణామం. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఈ ప్రాంతంలోని లక్ష ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉంది.

- ఎండీ. యూసుఫ్, టీపీసీసీ ప్రతినిధి, కొడంగల్

కొడంగల్, జూన్ 16 : కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌తో జిల్లా ప్రజలకు మహర్దశ పట్టనుంది. ఈ పథకం పూర్తితో కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు, 0.38 టీఎంసీల మేర తాగునీటి కోసం కేటాయించనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన విషయం విదితమే. మొత్తం పది చెరువులకు నీటిని మళ్లించాల్సి ఉండగా.. వాటి సామర్థ్యాన్ని 0.9 టీఎంసీల నుంచి 2.1 టీఎంసీల వరకు పెంచాలని మొదట్లో నిర్ణయించారు. తాజాగా దానిని 4.02 టీఎంసీలకు పెంచుతూ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. లిఫ్ట్ స్కీంకు సంబంధించి బీమా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన భూత్పూర్ జలశయం నుంచి చివరి వరకు ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. తాజా ప్రతిపాద నల ప్రకారం రెండు దశల్లో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. భూత్పూర్ జలాశయం నుంచి మూడుచోట్ల నీటిని లిఫ్ట్ చేసేందుకు నిర్ణయించారు. మరోదశలో భూత్పూర్ జలాశయం నుంచి భూత్పూర్ చెరువుకు నీటిని ఎత్తిపోస్తూ అక్కడి నుంచి జయమ్మ చెరువు, కానుకుర్తి చెరువుకు నీటిని లిఫ్ట్ చేయనున్నారు. ఇందుకు సంబంధిత చెరువుల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

**లక్ష ఎకరాలకు సాగు నీరు**

ఎత్తిపోతల పథకంలో లక్ష ఎకరాలకు 7 టీఎంసీల నీటిని వాడనున్నారు. మక్తల్ నియోజకవర్గంలోని ఉట్కూర్, మక్తల్ మండలాల పరిధిలో 25.783 ఎకరాలు, నారాయణపేట నియోజకవర్గంలో నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద మండలాల్లో 20.472 ఎకరాలు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, మద్దూర్, కోస్గి, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో 53.745 ఎకరాలతో కలిపి లక్ష ఎకరాలను ఈ ప్రాజెక్టు కింద ప్రతిపాదించారు. భూగర్భ సొరంగాలకు బదులు ప్రెషర్ మెయిన్స్ నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సర్వే నిర్వహించి రూ.3.117 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేశారు. ఈ పథకం కోసం మార్పులు, చేర్పులు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**రూ.4.350 కోట్ల అంచనాతో ..**

గతంలో ప్రతిపాదించిన నీటి నిల్వ కంటే ప్రస్తుత సామర్థ్యం పెంచడంతో అంచనా విలువ పెరిగింది. మొదటగా 1.2 టీఎంసీల నుంచి 4.02 టీఎంసీల నీటి నిల్వకు వీలుగా చెరువుల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం సైతం రూ.2,945.50 కోట్ల నుంచి రూ.4.350 కోట్ల వరకు చేరింది. మొదటగా ప్రతిపాదించిన నాలుగు దశలకు బదులుగా రెండు దశల్లో ఈ పథకాన్ని పూర్తి చేసేందుకు టెండర్లను ఆహ్వానించారు.

**సంగం బండకు బదులు..**

సంగం బండ రిజర్వాయర్ నుంచి కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తరలించాలని భావించినా.. ప్రస్తుతం అందుకు బదులు భూత్పూర్ జలాశయం నుంచి తరలించేందుకు పథకాన్ని రీడిజైన్ చేశారు. దాంతో నీటిని తీసుకునే ప్రాంతం నుంచి సరఫరా చేసే చివరి ప్రాంతం వరకు సమగ్ర సర్వే అధ్యయనం ముగిసింది. తాజా ప్రతిపాదనల మేరకు భూత్పూర్ జలాశయం నుంచి కానుకుర్తి వరకు మూడు చోట్ల నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. మొత్తం రెండు దశల్లో ప్రాజెక్టు పనులను పూర్తిచేసి రైతులకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. మొదటి దశలో భూత్పూర్ జలాశయం నుంచి ఊట్కూర్ చెరువుల్లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. అక్కడి నుంచి జయమ్మ చెరువు, కానుకుర్తి చెరువుకు నీటిని ఎత్తిపోస్తారు. ఇందుకు సంబంధించి ఆయా చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపు పనులను చేపట్టనున్నారు. మొదటి దశ పనులకు రూ.2.945 కోట్ల వ్యయంతో అంచనా వేశారు. రెండో దశ పనుల్లో భాగంగా ఖాజీపూర్, దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్, హస్నాబాద్‌తో పాటు 7చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంచుతారు. రెండో దశ పనులకు రూ.1404.50 కోట్ల అంచనా చేశారు. భూత్పూర్‌తో పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో నిర్మించిన ఉదండపూర్ రిజర్వాయర్ 269 అడుగుల సముద్ర మట్టం నుంచి నీటిని లిఫ్ట్ చేయడం కంటే సముద్రానికి 350 అడుగుల మట్టంలో ఉన్న భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోసేందుకు తక్కువ వ్యయంతో సులభంగా ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

### సొరంగాలకు బదులుగా ప్రెషర్ మెయిన్స్

భూసేకరణ సమస్య తలెత్తకుండా త్వరలోనే పనులను చేపట్టాలనే నిర్ణయంతో ప్రభుత్వం పరిశీలిస్తుంది. అందులో భాగంగా సొరంగాలకు బదులుగా ప్రెషర్ మెయిన్స్ (యంత్రాల) ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలని నిర్ణయించారు. సాధారణంగా సొరంగం తవ్వేందుకు ఎక్కువ భూమి కావాల్సి ఉండటంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో తక్కువ ఖర్చు, భూ సేకరణ సమస్యలు తలెత్తకుండా పనులను వేగవంతం చేయాలనే ఆలోచనతో ప్రెషర్ యంత్రాలతో ప్రాజెక్టును నిర్మించాలని భావిస్తున్నారు. ఉద్దండపూర్ రిజర్వాయర్ సముద్రమట్టానికి 269 అడుగుల నుంచి నీటిని లిఫ్ట్ చేయడం కంటే భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోయడం సులభంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.


కొడంగల్ పెద్ద చెరువు


గోధుమకుంటలో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

» ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, జూన్ 16 : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామాకూర మల్లారెడ్డి అన్నారు. దాతల సహాయంతో మండల పరిధి గోధుమకుంట గ్రామం చంద్రఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, పార్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సంఘటితమై, స్వచ్ఛందంగా నిధులను సమకూర్చుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, ఇతర నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతలు

బదిలీపై నల్గొండకు వెళ్లిన కలెక్టర్ నారాయణరెడ్డికి ఘనంగా వీడ్కోలు


రిజిస్ట్రర్‌లో సంతకం చేస్తున్న ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నారాయణరెడ్డిని నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసి ఆయన స్థానంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన ప్రతీక్ జైన్‌ను నియమించిన విషయం తెలిసిందే. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ప్రతీక్ జైన్‌కు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు వసుచంద్ర, శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో సుధీర్, వివిధశాఖల అధికారులు గోపాల్, రేణుకాదేవి, జ్ఞానేశ్వర్, మల్లేశం, బాబూ మోజెస్, హన్మంత్‌రావు, పల్వన్‌కుమార్, లక్ష్మీనారాయణ, డీపీఆర్‌వో చెన్నమ్మ, ఏపీఆర్‌వో ప్రభాకర్, కలెక్టరేట్ ఏవో అమరేందర్‌కృష్ణ జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రతీక్ జైన్, కలెక్టర్ నారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన వివిధ అంశాల గురించి కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం బదిలీపై వెళ్లిన నారాయణరెడ్డికి వివిధ శాఖల అధికారులు వీడ్కోలు పలికారు.

**సంతృప్తితో వెళుతున్నా: నారాయణరెడ్డి**

వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేయడం తనకెంతో సంతృప్తిని ఇచ్చిందని నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిన నారాయణరెడ్డి అన్నారు. తాను గతంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన తాను ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద జిల్లాల్లో ఒకటైన నల్లగొండ జిల్లాకు బదిలీపై వెళుతున్నానని చెప్పారు. జిల్లాలో ధరణి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను అందరి సహకారంతో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించుకోగలిగామని గుర్తు చేశారు. ప్రభుత్వ పరంగా కొనసాగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు జరిగేలా చూశామన్నారు. ఇక్కడ తాను కొనసాగిన ఏడాదిన్నర కాలంలోనే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగడంతో దృష్టంగా ఎన్నికలపైనే కేంద్రీకరించాల్సి రావడంతో ప్రత్యేకంగా ప్రాంతం అభివృద్ధిపై దృష్టి సారించేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. తన దృష్టికి వచ్చిన ధరణి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు మంచి వారని, వివాద రహితులని, జిల్లా ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని ఆయన కొనియాడారు.


కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నారాయణరెడ్డి

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సాయినగర్‌లో డ్రైనేజీని ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి


ఘట్‌కేసర్, జూన్ 16 : కాలనీల అభివృద్ధి పనుల్లో దాతలు భాగస్వాములు కావాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నోజిగూడ సాయినగర్ కాలనీలో రూ. 1.30లక్షల దాతల ఆర్థిక సహాయంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సాయినగర్ కాలనీ వాసులు సొంతంగా డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేసిన కాలనీవాసులను చైర్మన్ శాలువాలతో సత్కరించారు. వేణుమాధవ్, శ్రీనివాస్, నరేష్, వెంకట్‌రెడ్డి, శ్రీరాం, సుధాకర్. అలీ పాల్గొన్నారు.

## సరదా.. సందడి



**కోట్‌పల్లి ప్రాజెక్టుకు సందర్శకులు భారీగా వచ్చారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో సందడిగా మారింది. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ప్రాజెక్టు నీటిలో ఈత కొడుతూ, సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. కొంతమంది బోటింగ్ చేశారు.**

ధారూరు, జూన్ 16




# ఏటి కాల్వ మరమ్మతులు ఎన్నడో..?

బొంరాస్‌పేట్, జూన్ 17: బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు ప్రధాన ఆయువు ఏటికాల్వ. ఈ ఏటికాల్వ గతేడాది వర్షాకాలంలో తెగిపోయి గండిపడినా ఎవరూ పట్టించుకోలేదు. గత వర్షాకాలంలో బొంరాస్‌పేట్ పెద్దచెరువు నిండిన అనంతరం ఈ గండి పడింది. చెరువు నిండటంతో రైతులు ఈగండి పూడ్చేందుకు ముందుకురాలేదు. సంవత్సరం గడుస్తున్నా నేటికీ ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటి వరకు బొంరాస్‌పేట్ పెద్ద చెరువు ఏటి కాల్వ, పాటు కాల్వ, పొలాలకు నీరు వెళ్లే కాల్వలను రైతులు చందాలు వేసుకొని స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకోవడమే తప్ప ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదు. దశాబ్ద కాలం ఏటి కాల్వ మరమ్మతులకు రూ.కోటి మంజూరు కాగా తిరిగి సాయం అందలేదు. ఐదు సంవత్సరాల కిందట ఈకాల్వను ఎవరూ పట్టించుకోకపోవడంతో అప్పుడే బొంరాస్‌పేట్‌కు సర్పంచ్‌గా ఎన్నికైన కోవూరి విజయమ్మ కుమారులు సంతోష్, వీరేశంలు తమ సొంత నిధులతో ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టు నుంచి బొంరాస్‌పేట్ పెద్దచెరువు వరకు దాదాపు 5 కిలోమీటర్ల కాల్వను పూడిక తీయించారు. ఈ పూడిక తీయడంతో నాలుగు సంవత్సరాలు వరుసగా చెరువు నిండటంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకున్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో ఈ ఏటి కాల్వకు గండిపడినా ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి దృష్టికి రైతులు తీసుకెళ్లారు. వర్షాకాలం సమీపించడంతో భారీగా వర్షాలు కురిస్తే పైనుంచి వరదనీరు వృథాగా కాకరవాణి ప్రాజెక్టులోకి వెళ్తుంది. ఇప్పటికైనా రైతులపై ప్రత్యేక దృష్టి సారించి ఇరిగేషన్ అధికారులు ఏటి కాల్వ గండిని పూడ్చాలని బొంరాస్‌పేట్ రైతులు కోరుతున్నారు


ఏటి కాల్వకు పడిన గండి, అడ్డుగా మట్టి కట్టలు, పిచ్చి మొక్కలు





















# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

# 'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుట్లలో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

### సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

# ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో' మొబిలిటీకి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్డ్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

# సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టుల్లో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

# యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

# 164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు




విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

# వీవోఏలను వేధిస్తున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

- సెర్ప్ సీఈవోకు బాధితుల ఫిర్యాదు



సెర్ప్ సీఈవోకు ఫిర్యాదు చేస్తున్న వీవోఏలు

చౌదరిగూడ, జూన్ 16: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న రామస్వామి మహిళ వీవోఏలను వేధిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని గత శుక్రవారం వీవోఏ ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్ సెర్ప్ సీఈవో అనితా రామచంద్రన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ ఏపీఎం రామస్వామి మహిళ వీవోఏలను వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో కూడా రామస్వామిపై ఇలాంటి ఆరోపణలు రావడంతో తాము సంఘం తరఫున మందలించామని, ఆయన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామస్వామి మహిళా వీవోఏలకు ఫోన్‌చేసి అసభ్యకర పదజాలంతో మేసేజ్‌లు పంపుతున్నారని, దీనివల్ల వారి కుటుంబాల్లో సమస్యలు వస్తున్నాయని ఫిర్యాదు పేర్కొన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఏపీఎం రామస్వామిని విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కాగా, రామస్వామి మహిళా వీవోఏలకు చేసిన మెసేజ్‌లు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతుండటంతో ప్రజా సంఘాల నాయకులు, మహిళా సభ్యులు రామస్వామిని వెంటనే సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కాగా, రామస్వామి ఇంతకుముందు మాడ్గుల మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహించేవాడని ఆయన చెప్పారు. సీఈవోకు ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి, కోశాధికారి తిరుపతి, చంద్రశేఖర్, అరుణ, జానకి, మహేశ్వరి, మాధవి, రమ్యశ్రీ, అమృత, సుధాకర్, చిత్కలా, సుమిత్ర, నస్రీన్, అమరావతి, శిరీష తదితరులు ఉన్నారు.

# దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- రూ.80 వేలు, 3 కార్లు, స్కూటీ స్వాధీనం
- పోలీసుల అదుపులో 15 మంది నిందితులు
- ఒకే ఇంట్లో రెండుసార్లు దోపిడీకి విఫలయత్నం
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు




స్వాధీనం చేసుకున్న వస్తువులు



పోలీసుల అదుపులో నిందితులు

ఆదిభట్ల, జూన్ 16 : దోపిడీ దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి నగదు, కార్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అబ్దుల్లాపూర్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నివసిస్తున్న చెన్నైకి చెందిన వ్యాపారి తిరుమన తురై ఇంట్లో ఈనెల 11న చోరీకి ప్రయత్నించిన కేసును ఆదిభట్ల పోలీసులు ఛేదించారు. ఈ కేసుతో సంబంధమున్న 15మంది నిందితులను అరెస్టు చేశారు. మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సమక్షంలో ఆదిభట్ల ఎస్‌హెచ్‌వో రాఘవేందర్‌రెడ్డి నిందితులను ఆదివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీసీపీ మాట్లాడుతూ ఈనెల 11న తుర్కయంజాల్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో నివాసముండే చాక్లెట్ తయారీ సంస్థ వ్యాపారి తిరుమన తురై ఇంటివద్ద దుండగులు వాచ్‌మ్యాన్‌ను కొట్టి.. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ప్రధాన ద్వారం పగులగొట్టి ఇంట్లోకి ప్రయత్నించారు. గమనించిన వ్యాపారి కుమార్తె డయల్ 100కు కాల్‌చేసి ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసు సైరన్ శబ్దం విని దుండగులు పారిపోయారు. అయితే, వారు వెళుతూ వెళుతూ వాచ్‌మ్యాన్ సెల్ ఫోన్ లాక్కొని పారిపోయారు. తిరుమన తురై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. డీసీపీ పర్యవేక్షణలో ఏసీపీ ఆధ్వర్యంలో ఆదిభట్ల ఎస్‌హెచ్‌వో రాఘవేందర్ రెడ్డి స్పెషల్ టీమ్‌ను ఏర్పాటుచేసి దర్యాప్తు చేసేక్రమంలో వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బేకరీలో సమావేశం అయిన నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకొని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు.

## రూ.950 కోట్ల బ్లాక్‌మనీ ఉందని స్కెచ్!

హయత్‌నగర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి బోగిని జంగయ్యకు డ్రైవర్ శేఖర్‌రెడ్డి, ఇసుక వ్యాపారం చేసే ఎండీ షైమూద్ అనే స్నేహితులున్నారు. వారంతా వ్యాపారాల్లో నష్టాల పాలై తుర్కయాంజాల్‌లోని టీషాప్ దగ్గర తరచూ కలుస్తూ ఉండేవారు. ఈక్రమంలో ఏదైనా చట్ట వ్యతిరేక పనులు చేసి డబ్బులు సంపాదించాలని నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో తిరుమన తురై ఇంట్లో రూ.950 కోట్లు నల్లధనం ఉన్నట్లు.. వ్యాపారి ఇంట్లో గతంలో వాచ్‌మ్యాన్‌గా పనిచేసిన వ్యక్తి ద్వారా రియల్‌ఎస్టేట్ వ్యాపారి బోగిని జంగయ్యకు సమాచారం వచ్చింది. కూకట్‌పల్లికి చెందిన ఓ పూజారిని తీసుకువచ్చి పూజలు చేయించి దొంగతనం చేయాలనుకున్నారు. కానీ, వీళ్లు ఇచ్చే డబ్బు సరిపోకనో.. మరేదో కారణంచేతనో పూజారి మళ్లీ వారి వద్దకు రాలేదు. దాంతో విజయవాడకు చెందిన రజాక్ అనే క్రిమినల్‌ను సంప్రదించారు. వ్యాపారి తిరుమన తురై వద్ద పనిచేసిన మేనేజర్ నెంబర్ తీసుకొని తనను సంప్రదించి నల్లధనం ఉన్న విషయం నిజమేనని నిర్ధారించుకున్నారు.

## గతంలో మోసపోయిన వ్యక్తిని మళ్లీ రంగంలోకి దింపి..

రజాక్ అనే క్రిమినల్ ద్వారా గతంలో మోసపోయిన సతీష్ అనే వ్యక్తికి ఫోన్‌చేసి గతంలో పోగొట్టుకున్న సొమ్ము తిరిగి సంపాదించుకునేందుకు అ దకాశం వచ్చిందని, వ్యాపారి ఇంటి లొకేషన్ పంపించి రూ.950 కోట్ల నల్ల ధనం ఉందని, దోపిడీ చేయడానికి మనుషులు కావాలని, నీకు కూడా వాటా ఉంటుందని చెప్పాడు. దాంతో సతీష్ జాఖీ లఖానీ అనే వ్యక్తి ద్వారా షైమూద్, సతీష్‌లకు ఉమ్మడి మిత్రుడైన పెద్ది శ్రీనివాస్ కూడా దోపిడీ చేసేందుకు ఒప్పుకున్నాడు. జాఖీ లఖానీ, సవూద్, ఆదిల్, ముదాసీర్, ఖాదర్, అక్బర్, షమీమ్, జాఫర్, ఇస్మాయిల్‌లతో టీమ్ ఏర్పాటు చేసి దోపిడీకి రెక్కీ నిర్వహించారు. ఇంట్లోకి వెళ్లేందుకు ఐరన్ కట్టర్, స్పానర్స్, రెండు ఫైర్‌స్ప్రేలు, డోర్ తాళం పగల గొట్టడానికి ఐరన్ రాడ్‌లు అవసరమైతే ఎదురించిన వారిని హత్య చేసేందుకు కత్తులు, ఇతర ఆయుధాలు కొనుగోలు చేశారు. ఈనెల 4న రాత్రి 1.30 గంటల సమయంలో దోపిడీకి వెళ్లారు. ఇంట్లోకి ప్రవేశించి చూడగా యజమాని కుటుంబం మెలకువతో ఉండగా.. బయట వాచ్‌మ్యాన్ కూడా ఉండటంతో వెనుతిరిగి వచ్చేశారు. ఈనెల 11న తెల్లవారుజామున మరోసారి పథకం వేశారు. ఇద్దరు వాచ్‌మెన్‌లను కొట్టి బెదిరించి చేతులు కట్టేసి ఇంటి చుట్టూ ఉన్న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి 8 మంది గోడదూకి ఇంట్లోకి ప్రవేశించారు. నిచ్చెనల సహాయంతో రెండో అంతస్తుకు వెళ్లగా శబ్దంతో ఇంట్లోవారు లేచి సీసీ టీవీలో చూసి ఇంట్లోకి దొంగలు ప్రవేశించినట్లు గుర్తించి డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

### పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ప్లాన్

అంతా అనుకున్నట్లు జరిగి తిరుమనతురై ఇంట్లో దోపిడీ చేస్తే.. ప్రజలు, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు సైతం దుండగులు ప్లాన్ వేశారు. దోపిడీ అనంతరం దొంగతనం చేసిన డబ్బులు ఉంచిన స్థలంలో ఫేక్ మనీ తయారుచేసే బ్లాక్ పేపర్స్ బండిల్స్, దానికి అవసరమయ్యే పౌడరు, లిక్విడ్‌లు ఉంచి తిరుమనతురై ఇంట్లో ఫేక్‌మనీ తయారుచేస్తున్నట్లు నమ్మించి పోలీసుల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నించినట్లు డీసీపీ చెప్పారు.

## మూడోసారి పోలీసులకు చిక్కి..

తిరుమనతురై ఇంట్లో రూ.950 కోట్ల నల్లధనం ఉందని నమ్మి.. రెండుసార్లు దోపిడీకి యత్నించి మూడోసారి ప్లాన్ చేసేందుకు వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బేకరీలో సమావేశమైన 15 మంది నిందితులను ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీస్ టీం చాకచక్యంగా పట్టుకొని వారి నుంచి రూ.80వేల నగదుతోపాటు 3 కార్లు, స్కూటీ, 16 సెల్‌ఫోన్లు, 2 ఐరన్ కట్టర్లు, 2 ఫైర్‌స్ప్రేలు, ఇనుప రాడ్లు, 6 ఫేక్‌మనీ బ్లాక్ పేపర్స్ బండిల్స్, ఫేక్ మనీ తయారీ పౌడర్, 20 లీటర్ల రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం ఆదివారం రిమాండ్‌కు తరలించారు. పెద్దఎత్తున దోపిడీకి యత్నించిన దొంగలను కేవలం వారంలోపే అరెస్టు చేసిన ఎస్‌హెచ్‌వో రాఘవేందర్ రెడ్డి, ఎస్సై కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కానిస్టేబుల్ కృష్ణ, రవిందర్, ఉపేందర్, శివచంద్ర, సంతోష్‌లతో కూడిన ప్రత్యేక టీమ్‌ను డీసీపీ, ఏసీపీలు అభినందించారు.

# అన్నదాతకు 'ఇక్రిశాట్' భరోసా

- ప్లాంటిక్స్ యాప్‌తో మేలు



దౌల్తాబాద్, జూన్ 16: ఆధునిక యుగంలో వ్యవసాయంలో కొత్త హంగులు అద్దుతూ సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్‌లోని అంతర్జాతీయ పంట పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయదారుల కోసం ప్లాంటిక్స్ అనే యాప్‌ను రూపొందించింది. రాష్ట్రం, దేశంలో ఏ మూలన ఉన్నా సరే రైతుల చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు పంటలకు చీడపురుగులు, క్రిమికీటకాల బారి నుంచి కాపాడేందుకు రైతులకు భరోసాను ఇస్తూ నీకు నేనున్నాంటూ అరచేతిలోనే సమస్యలకు పరిష్కారం చూపుతోంది. ఈ ప్లాంటిక్స్ యాప్ మొబైల్ ఫోన్ గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో అన్ని పంటలకు సంబంధించిన సస్యరక్షణ చర్యలు, యజమాన్య పద్ధతులు, చీడ పీడలు, తెగుళ్ల నివారణ, పోషకాలు, సమస్యలు, సూచనలు, సలహాలతో రైతులకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చు. గతంలో పంట వేసిన అనుభవజ్ఞులైన రైతులు లేదా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకునే వారు. ఇప్పుడు పంటకు పట్టిన చీడ పురుగు, తెగుళ్లకు సంబంధించిన ఫొటోలు తీసి పంపితే చాలు. దాని నివారణకు ఏం చేయాలో యాప్‌లో పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

## ఏ పంట సమస్యకైనా పరిష్కారం

రైతులు కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు దినుసులు, అపరాలు లాంటివి పండిస్తారు. ఇప్పటి వరకు ఏపంట పండించినా వాటి సాగు విధానం, సస్యరక్షణ, యజమాన్య పద్ధతులు తదితర వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. వాతావరణ పరిస్థితులు, గాలి తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో వేగం తదితర అన్ని అంశాలను ఇందులో తెలుసుకోవచ్చు.

## సమగ్ర సమాచారం

పంటలకు తెగుళ్లు, చీడపీడల విషయంలో ప్లాంటిక్స్ యాప్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆ సమస్యలను నిపుణులకు తెలియజేయడంతో పాటు వాటి పరిష్కారాన్ని పొందే అవకాశం కూడా ఈ యాప్ ద్వారా లభిస్తుంది. తెగుళ్లు, చీడపీడలు సోకిన పంటల ఫొటోలను తీసి పంపితే వెంటనే ఆ పంటకు సోకిన తెగులు ఏంటో వెల్లడిస్తుంది. అంతేకాదు ఆ తెగులుకు వాడాల్సిన మందులనూ సూచిస్తుంది. అవి ఏ మోతాదులో వాడాలో వివరిస్తుంది. యాప్‌లో కమ్యూనిటీ ఆప్షన్‌లోకి వెళ్తే సహచర రైతులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతుల అనుభవాలు, సందేహాలను పంచుకునే అవకాశముంటుంది. ఇదంతా రైతు తాను ఉన్న ప్రదేశం నుంచే చేయవచ్చు. ఇంకా పంట లాభాన్ని అంచనా వేసుకోవచ్చు. తన చుట్టూ ఏఏ ఎరువులు, పురుగు మందుల దుకాణాలు అందుబాటులో ఉన్నాయో కూడా చూయిస్తుంది.

### యాప్ అద్భుతంగా ఉంది



పంటలకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్ ఉంటే పంటలకు ఓ వైద్యుడిని వెంట పెట్టుకున్నట్లు ఉంది. పంట పొలాల గురించి ఆందోళన చెందాల్సిన పని లేదు. ఈ యాప్ రైతులందరికీ చేరితే బాగుంటుంది.

కుమ్మరి నర్సప్ప, రైతు, దేవరఫస్లాబాద్

# ప్రమాదకరంగా ఎన్టీఆర్ చౌరస్తా

- విస్తరించాలని పట్టణ ప్రజల విన్నపం



వికారాబాద్, జూన్ 17: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తా ప్రధాన కేంద్రం ఇరుకుగా మారింది. అప్పట్లో రోడ్డు మధ్యలో వేసిన ఎన్టీఆర్ విగ్రహం ఇప్పుడు సమస్యగా మారింది. ఆ చౌరస్తాలో ఏ దిక్కు నుంచి ఏవాహనం వస్తుందనేది దగ్గరకు వచ్చే వరకు తెలియని విధంగా మారింది. విగ్రహం కట్ట పెద్దగా ఉండడం ముందు వచ్చే వాహనాలు కనపడక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్టీఆర్ చౌరస్తా నుండి తాండూరు, హైదరాబాద్ వెళ్లేందుకు మార్గాలు ఉండగా ఆ దారి గుండా వెళ్లే వారే ఎక్కువ. అదే సమయంలో ఈ దారి గుండానే విద్యార్థులు, ఉద్యోగాలు స్కూల్, కళాశాల, కార్యాలయాలకు వెళుతుంటారు. ఈ దారి గుండానే పెద్ద పెద్ద లారీలు కూడా వెళుతుండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఎన్టీఆర్ విగ్రహం కొంత పక్కకు జరిపి చౌరస్తాను కొంత విస్తరిస్తే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ దిశగా అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

# బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి



పరిగి: ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

పరిగి,జూన్ 16: బక్రీద్ పండుగకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరిగి మున్సిపాలిటీలోని అనంతరెడ్డినగర్, సుల్తాన్‌నగర్‌లలోని ఈద్గాల వద్ద ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, సిబ్బంది వినోద్, జగర్ తదితరులు ఈద్గాల వద్ద శుభ్రం చేయించారు. బక్రీద్ సందర్భంగా సోమవారం ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**కొడంగల్:** త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను ముస్లింలు సోమవారం జరుపుకోనున్నారు. పండగ సందర్భంగా కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి మైనార్టీ నాయకులతో కలిసి కొడంగల్‌లో ఈద్గాను పరిశీలించారు. ఈద్గా పరిసరాల్లో మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు ఈద్గాకు సీసీరోడ్డు వేయించాలని కోరారు. త్వరలోనే సీసీరోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్, ఆసీఫ్‌ఖాన్, సయ్యద్ అన్వర్ హుసేన్, సయ్యద్ మునీర్, అమేర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈద్గాలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ తెలిపారు. స్థానిక జామే మస్జీద్ నుంచి ఉదయం 8:30 గంటలకు ర్యాలీగా ఈద్గాకు చేరుకోనున్నట్లు తెలిపారు. ఒక వేళ వర్షం కురిస్తే పట్టణంలోని జామా మస్జీద్‌లో ఉదయం 9గంటలకు, మక్కా మస్జీద్‌లో 9:30గంటలకు, ఇబ్రహిం మస్జీద్‌లో 8:30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**కులకచర్ల:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ముస్లింలు ఏర్పాట్లు చేస్తున్నారు. కులకచర్ల, ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల, పుట్టపహాడ్, చౌడాపూర్ గ్రామాల్లోని ఈద్గాలను ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఈద్గాల్లో ముస్లింలు సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.



మైనారిటీ నాయకులతో కలిసి ఈద్గాను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



కులకచర్ల: ముస్తాబైన ముజాహిద్‌పూర్‌లో ఈద్గా

### ముస్లింలకు సరుకులు పంపిణీ

**కొడంగల్:** బక్రీద్ పండగను పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి నిరుపేద ముస్లింలకు సరుకులను పంపిణీ చేశారు. మండలంలోని రావుల్‌పల్లిలో ఆదివారం నిరుపేద ముస్లింలకు పండగ సందర్భంగా బియ్యం, నూనె, చక్కెర తదితర సరుకులను అందజేశారు. పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డి, మురారి వశిష్ఠ, మునీర్, ఆమేర్ పాల్గొన్నారు.



కొడంగల్: నిరుపేద ముస్లింలకు సరుకులు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

క్రైం కార్నర్

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 16: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పోచారం, తాండూరు పరిధిలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బొక్కొనిగూడకు చెందిన మహ్మద్ బాబా జాన్(45), పోచారం మున్సిపల్, జోడిమెట్ల సమీపంలోని ఓ ప్రైవేటు కెమికల్ కంపెనీలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా శనివారం రాత్రి 11గంటలకు పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మహ్మద్ బాబా జాన్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**తాండూరు రూరల్:** బైకును ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన తాండూరు మండలం అంతారం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం కందనెల్లి తండాకు చెందిన శ్రీనివాస్ బైక్‌పై తాండూరుకు వచ్చి తిరిగితండాకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాండూరు మండలంలోని అంతారం గ్రామశివారు వరకు రాగానే బైపాస్ రింగ్‌రోడ్డు వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తల నుజ్జునుజ్జయి దుర్మరణం చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులతో చర్చించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత అదృశ్యం



షబానా బేగం

ధారూరు, జూన్ 16: భర్తతో తలెత్తిన విభేదాలతో తల్లిగారింటికి వచ్చిన వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని మోమిన్‌కలాన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన బంటు తారబి కూతురు షబానా బేగం(40 సంవత్సరాలు)కి వికారాబాద్‌కు చెందిన తాజుద్దీన్‌తో 13సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. కాగా షబానా బేగంకు భర్త తాజుద్దీన్‌తో విభేదాలు తలెత్తటంతో గత నెలలో పుట్టింటికి వచ్చి తల్లి తారబితో ఉంటోంది. కాగా ఈనెల 14న తెల్లవారుజామున షబానా బేగం తల్లిగారింటి నుంచి అదృశ్యమైంది. ఆమె ఆచూకీ కోసం భర్తతో పాటు బంధువులను ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆదివారం తల్లి తారబి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

ధారూరు, జూన్ 16: పశువుల తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. మండలంలోని లక్ష్మీనగర్ తండా వద్ద బోలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఒక ఆవు, మూడు లేగ దూడలు కనిపించటంతో వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, పశువులను తరలిస్తున్న ధారూరుకు చెందిన హాలీంపై కేసు నమోదు చేశామని చెప్పారు.

## వరుణ్ మోటార్స్ నుంచి ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారు డెలివరీ



ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ ఆల్ న్యూజెడ్ సిరీస్ కారును కస్టమర్స్‌కు అందజేస్తున్న వరుణ్ మోటార్స్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భారతదేశపు ప్రముఖ కార్ల కంపెనీ నుంచి విడుదలైన 175వ కార్ 'ది ఎపిక్ న్యూ స్విఫ్ట్' ఆల్ న్యూ జెడ్ సిరీస్ ఇంజన్‌తో తయారైన 50వ కారును వరుణ్ మోటార్స్ బాలానగర్ మారుతి డ్రైవింగ్ స్కూల్‌లో కస్టమర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ప్రతినిధులు కౌషిక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌సీ రాజు, వరుణ్ మోటార్స్ జనరల్ మేనేజర్ కృష్ణ కుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు 50వాహనాలు డెలివరీ అయినట్లు వరుణ్ మోటార్స్ ప్రతినిధులు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కులకచర్ల, జూన్ 16: మండలంలోని ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులు ఆబీబ్ అహ్మద్, నర్సింహులు, వెంకటయ్య, రాములును సన్మానించారు. 30ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. ప్రస్తుతం చాలా మంది స్నేహితులు ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్, గోవర్దన్‌రెడ్డి, రఘునాథ్, యాదయ్య, విజయనిర్మల పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



సుధాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్

వికారాబాద్, జూన్ 16: కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సుధాకర్‌రెడ్డి అనంతగిరి పద్మనాభ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాలువాతో సత్కరించారు. అనంతరం బీజేఆర్ చౌరస్తాలో గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన నివాసంలో జరిగిన జన్మదిన వేడుకల్లో నాయకులు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి కేక్ కట్‌చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై సుధాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### డోలారోహణ కార్యక్రమానికి స్పీకర్ హాజరు

వికారాబాద్, జూన్ 16: ఎన్నెపల్లి లోని ఛాయా బ్యాంక్వెట్ హాల్‌లో ఆదివారం జరిగిన పీఆర్టీయూ టీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మాలీస్ ప్రతాప్ మనవరాలి డోలారోహణ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, పి.రాంరెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పల్లవి శివానందం, సీనియర్ నాయకులు రాములు యాదవ్, విజయకుమార్, బాదం అశోక్, శివానందం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని తేజ కన్వెన్షన్ హాల్లో జరిగిన బార్వాద్ విఠల్ కూతురి సారీ ఫంక్షన్‌కు హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్,రాంచెంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సుద్ద నిల్వదారుడికి ఎట్టకేలకు నోటీసులు

తాండూరు, జూన్ 16: మారేపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 11లో అక్రమ సుద్దనిల్వ పెట్టిన స్థలం ఓనర్‌పై మైన్స్ శాఖ ఎట్టకేలకు ఈ నెల 14న నోటీసులు జారీ చేసింది. నోటీస్ నెంబర్ 1365 సిసి/2024కింద కోఫియా మైనింగ్ లిమిటెడ్ కంపెనీకి రిజిష్టర్ పోస్టు ద్వారా నోటీసు పంపినట్లు మైన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరాంరెడ్డి వెల్లడించారు. నోటీసుపై సమాధానం వచ్చాక తదుపరి చర్యలు చేపడుతామని తెలిపారు. అప్పటి వరకు పట్టుబడిన సుధ పోలీస్, రెవెన్యూ కస్టడీలో ఉంచాలని ఆ రెండు శాఖలకు స్వయంగా లేఖ పంపినట్లు తెలిపారు. తదుపరి సుద్ద అక్రమ తవ్వకాలు జరిపిన స్థలాన్ని గుర్తించడంతో పాటు ఎవరు తవ్వకాలు జరిపారు? ఎవరు యంత్రాలు వినియోగించారని విషయం ఏజీ ద్వారా విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లు, ఇతర శాఖల సహకారం లేకున్నప్పటికీ స్వయంగా మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ రంగంలో దిగి చర్యలు చేపట్టారు. ఇదిలాఉంటే అక్రమంగా సుద్ద తవ్వకాలకు వినియోగించిన యంత్రం దారులపై చర్యలు చేపట్టకుంటే మరోసారి అదే స్థలం అక్రమంగా సుద్ద తవ్వకాలు జరిపే అవకాశముంది.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

- పీడీఎస్‌యూ వికారాబాద్ జిల్లా కమిటీ



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

వికారాబాద్, జూన్ 16: జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పీడీఎస్‌యూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవోఎంఎస్ నెంబర్ 42 ప్రకారం జిల్లాలోని డిస్టిక్ ఫీజు రెగ్యులేటింగ్ కమిటీ అనుమతి తీసుకున్న తర్వాతే ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఫీజులను పెంచుకోవాలి. అయితే జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా తమ ఇష్టానుసారంగా, బుక్ స్టాల్స్‌తో కుమ్మక్కై నోట్‌బుక్‌లు, పుస్తకాలు అధిక రేట్లకు అమ్ముతూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ స్కూళ్ల అరాచకాలు రోజురోజుకు జిల్లా వ్యాప్తంగా పెరిగిపోతున్నప్పటికీ సంబంధిత విద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా వికారాబాద్ జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల దందా రోజురోజుకు మితిమీరిపోతోందని అన్నారు. కాలేజీ పుస్తకాలను ఏకంగా రూ.8వేల నుంచి రూ.10వేల వరకు అమ్ముతున్నాయని, కొన్ని స్కూళ్లువేల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొందని అన్నారు. కొన్ని బుక్ స్టాల్స్‌తో ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్ కుమ్మక్కై కమిషన్లకు పుస్తకాలు, నోట్ పుస్తకాలు అమ్ముతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా విద్యాధికారి వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లావ్యాప్తంగా పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా సభ్యుడు అశోక్, సురేష్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో యువకుడికి గోల్డ్ మెడల్



షాట్‌పుట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన సాయికిరణ్

కొడంగల్ రూరల్, జూన్ 16: జాతీయ స్థాయిలో షాట్‌పుట్ విభాగంలో వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన అల్వాల్ సాయికిరణ్ బంగారు పతకం సాధించాడు. నేషనల్ యూత్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ ఆధ్వర్యంలో షాట్‌పుట్ విభాగంలో ఈనెల 15, 16 తేదీల్లో ఛత్తీస్‌గడ్‌లో పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గత ఆరు నెలలుగా కోచ్ రమేశ్ (ద్రోణచార్య అవార్డు గ్రహీత) ద్వారా శిక్షణ పొంది పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున సాయికిరణ్ పాల్గొన్నాడు. పోటీలకు దేశంలోని 29రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఈనెల 15వ తేదీన క్వాలిఫై రౌండ్ నిర్వహించారు. ఈ క్వాలిఫై రౌండ్‌లో దేశంలోని టాప్ 12మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో ఐదు కిలోల షాట్‌పుట్ త్రోలో సాయికిరణ్ 18.36మీటర్ల దూరం విసిరి దేశంలోనే షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో తెలంగాణ రాష్ట్రానికి మొదటి బహుమతి దక్కింది. ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం సాయికిరణ్‌ను బంగారు పతాకం అందించి సన్మానించారు. కుటుంబ సభ్యులు, హస్నాబాద్ గ్రామస్థులు సాయికిరణ్‌ను అభినందించారు.

## హితం కళాశాలలో ఇన్నోవేషన్ అండ్ ప్రెన్యూర్ షిప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీనివాస్ మహాకాళి రావు

మేడ్చల్ టౌన్, జూన్ 16: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ జ్ఞానాపూర్ హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆదివారం ఇన్నోవేషన్ ప్రెన్యూర్‌షిప్ ఈవెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆఫ్ టీ-హబ్ శ్రీనివాస్ మహాకాళి రావు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఏషియా ఏటీడబ్ల్యూసీఐ ప్రెసిడెంట్ కవిత రాజేష్, ఈవా ఐపీ అండ్ ఐవీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మద్దుపాటి శ్రీనివాస్, డాక్టర్ గౌరవ్‌గుప్త పలు విద్యాసంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంజయ్య



నూతన చైర్మన్ అంజయ్య

పెద్దేముల్, జూన్ 16: కోట్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా గడ్డకింది అంజయ్యను నియమిస్తూ అగ్రికల్చర్ కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి యం.రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక గత పాలకవర్గాలను ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటి నుంచి నూతన పాలకవర్గం ఏర్పాటు కాలేదు. ఎట్టకేలకు కొత్తపాలకవర్గానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొత్త పాలకవర్గానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో పాటు సభ్యులను నియమిస్తూ అగ్రికల్చర్ కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. వైస్‌చైర్మన్‌గా పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన సాయిని నారాయణరెడ్డి, సభ్యులుగా బొజ్జభ్రమరాంభ, వీరపోల్ల హరిసూధన్‌రెడ్డి, ఎండి.ఇక్బాల్, ముడావత్ రామశెట్టి, మ్యాతరి చంద్రప్ప, గట్టిపల్లి రమేష్, మడావత్ పుష్పాబాయి, జె.బందప్ప, మందుల శ్రీనివాస్, షేక్ అక్బర్, సి.కిరణ్‌కుమార్, ఎన్.శ్రీధర్‌లను నియమించారు. చైర్మన్, వైస్‌చైర్మన్లుగా నియమించినందుకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# కొనలేం..తినలేం

- రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు



కొడంగల్ సంతలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కొడంగల్ రూరల్, జూన్ 16: కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత నెలతో పోల్చితే ధరలు ఆ మాంతం పెరిగిపోయాయి. మార్కెట్‌కు రూ.500 తీసుకెళితే సంచి కూడా కూరగాయలు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. టమాట, పచ్చిమిర్చి ధరలు రోజురోజుకు పెరుగుతుంటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుంది. గతంలో కిలో రూ.10 నుంచి రూ.20 ఉన్న ధరలు ప్రస్తుతం టమాట రూ.100 నుంచి రూ.120తో పాటు ఆలుగడ్డం, బెండ, బీరకాయ, చిక్కుడు కూరగాయల సైతం రూ.80 కి కిలో ధర పలుకుతున్నాయి.

### పెరిగిన ధరలతో ఇబ్బందులు



కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. కొడంగల్ సంతకు వెళితే రూ.500కు సంచి కూరగాయలు రావడం లేదు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో కొనలేం...తినలేం అని పరిస్థితి ఏర్పడింది. - కె.హన్మంతు, పెద్దనందిగామ

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా విజయలక్ష్మి పండిత్

తాండూరు, జూన్ 16: ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి తాండూరు పట్టణానికి చెందిన విజయలక్ష్మి పండిత్ ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. తాండూరు పట్టణం గగరాణి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన వికారాబాద్ జిల్లా మహాసభలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా బాల శంకర్ (సీసీఐ), ప్రధాన కార్యదర్శిగా రవీందర్(పెన్నా), ఉపాధ్యక్షులుగా ఎం.హేమంత్ కుమారి, వంశీకృష్ణ, కె.వెంకటేష్, కార్యదర్శులుగా ఎన్.పరశురాం, కె.దస్తప్ప, అశోక్, కోశాధికారిగా భూపతి (మున్సిపల్ సిబ్బంది)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, జూన్ 16: జాఫర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాల/కళాశాలలో తాత్కాలిక పద్ధతిని బోధించడానికి అతిథి అధ్యాపకులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జాఫర్‌పల్లి మాడల్ స్కూల్ ప్రిన్సిపల్ యాదయ్య తెలిపారు. ఆరవతరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు బోధించడానికి హిందీ సబ్జెక్టు బోధించడానికి హెచ్‌పీటీ, బాటనీ బోధించడానికి బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉండాలని సూచించారు. పీజీటీ పోస్టులు ఇంగ్లీష్, ఫిజిక్స్, కామర్స్, సివిక్స్, జువాలజీ, సబ్జెక్టుల్లో బోధించడానికి బీఈడీతో పాటు పీజీ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18వ తేదీ లోపు జాఫర్‌పల్లిలోని పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9000278284ను సంప్రదించవచ్చన్నారు.

## రైల్వేస్టేషన్‌లో ఆర్మీ జవాన్ జన్మదిన వేడుక



వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కుటుంబసభ్యులు

యాలాల, జూన్ 16: మండలంలోని పేర్కంపల్లి తండాకు చెందిన వెంకటేష్ నాయక్ ఇటీవల ఆర్మీలో శిక్షణ పూర్తి చేసుకొని గ్రామానికి వచ్చాడు. శిక్షణ అనంతరం విధులు నిర్వర్తించడానికి పంజాబ్ రాష్ట్రానికి ఆదివారం దేశ రక్షణకై బయలుదేరాడు. అదే రోజు వెంకటేష్ నాయక్ జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు తాండూరు రైల్వే స్టేషన్‌లో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## 19న ఎంపీకి పౌర సన్మానం



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి

వికారాబాద్, జూన్ 16: ఈనెల 19వ తేదీన చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్లనందు తెలిపారు. బీజేపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.శివరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పాండుగౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షుడు శిరీష, రాములు, సతీష్, ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మదన్‌పల్లి రాజు, తలారి రాజు పాల్గొన్నారు.

## నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



రాజ్యాంగంపై ప్రమాణం చేస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

ఘట్‌కేసర్, జూన్ 16: అంబేడ్కర్ కలలుగన్న నవసమాజ నిర్మాణానికి నేటి యువత కృషి చేయాలని ఘనాపూర్ మాజీ ఉపసర్పంచ్ బోనకుర్తి అర్జున్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేడు బడుగు బలహీన వర్గాల వారికి గల్లీ నుంచి ఢిల్లీ వరకు అనేక పదవులు రావడానికి అంబేడ్కర్ అందించిన రాజ్యాంగమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్ కుమార్, దాసు, మహేశ్వర్‌గౌడ్, కృష్ణగౌడ్, రాందాస్, సత్యం, గంగారాం, అంజయ్య, మహిపాల్, జగదీష్, కృష్ణంరాజు, గణేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

## అగ్రికల్చరల్ ఏఈఈగా కిష్టాపూర్ యువతి



ఏఈఈ పోస్టుకు ఎంపికైన స్రవంతి

దోమ, జూన్ 16: మండలంలోని కిష్టాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన పట్లోళ్ల కృష్ణారెడ్డి, అమృతల దంపతులకు ముగ్గురు కూతుళ్లు కాగా వారి రెండో కూతురు స్రవంతి అగ్రికల్చరల్ ఏఈఈగా ఉద్యోగం సాధించింది. ఏఈఈ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ పోస్టుల జాబితాలో స్రవంతి ఎంపికైంది. మొదటి కూతురు శ్రావణి 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపిక కావడం విశేషం. మూడవ కూతురు మేఘన గ్రూప్స్ ఉద్యోగాలకు ప్రయత్నిస్తోంది. తన ఇద్దరు కూతుళ్లు ప్రభుత్వం ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల ఆ తల్లి దండ్రుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయాన్ని సాధించానని తెలిపింది. పట్టుదల, అకింత భావం, నిరంతర శ్రమ, సమయస్ఫూర్తి ఉంటే ఏరంగంలోనైనా రాణించవచ్చని తెలిపింది. తనకు ప్రత్యక్షంగా పరోక్షంగా తోడ్పడిన వారికి ధన్యవాదాలు తెలిపింది.

## ముస్లింలపై దాడులు సరికాదు



మాట్లాడుతున్న ఎస్పీ.గుల్షన్

కొడంగల్ రూరల్, జూన్ 15: మెదక్‌లో ముస్లింలపై హిందూ వాహిని, భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్, గోరక్షక్ సభ్యులు దాడులకు పాల్పడడం సరైంది కాదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్పీ.గుల్షన్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పండుగల సమయంలో కులమతాల మధ్య చిచ్చురేపుతూ అల్లర్లు సృష్టించడం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇలాంటి దాడులకు పాల్పడుతుండటం హేయమైన చర్య అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు ఆదేశాలివ్వాలని కోరారు. బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎండీ.సర్తాజ్ హుసేన్, షేక్ రోమాన్, సయ్యద్ ముస్తాఫా, ఎండీ.అజర్, ఎండీ.షన్వాజ్ హుసేన్, సయ్యద్ అర్షద్ అలీఖాద్రి పాల్గొన్నారు.